బ్రాహ్మణ సేవా వాహిని రాష్ట్ర ఉపాధ్యక్షులుగా రాకేశ్‌కుమార్

నియామక పత్రాన్ని అందుకుంటున్న కొండపల్లి రాకేశ్‌కుమార్

కుత్బుల్లాపూర్, జూలై29 :బ్రాహ్మణ సేవా వాహిణి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కొంపల్లి జయభేరి ప్రాంతానికి చెందిన యూత్ అధ్యక్షులు కొండపల్లి రాకేశ్‌కుమార్ నియామకమయ్యారు. బీఎస్‌వీ ఫౌండర్ శేషం రఘుకిరణాచార్యులు, మాజీ ఎంపీ సముద్రాల వేణుగోపాలాచార్యులు నియామక పత్రాన్ని అందించారు. సుదర్శన్ లైవ్ టీవీ ఫౌండర్ కృష్ణ ప్రత్యేక ప్రశంసాపత్రాన్ని అందజేసి పుష్పగుచ్ఛంతో సత్కరించారు. తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు డయల్ యువర్ ఆఫీసర్

బాలానగర్, జూలై 29: కూకట్‌పల్లి, జీడిమెట్ల, మియాపూర్2, మేడ్చల్, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ (హెచ్‌సీయూ)డిపోల ప్రాంతాల ఆర్టీసీ ప్రయాణికులు సలహాలు, సూచనలు, సమస్యలు తెలియజేయడానికి మంగళవారం 'డయల్ యువర్ ఆఫీసర్' కార్యక్రమాన్ని చేపట్టినట్లు కూకట్‌పల్లి డిప్యూటీ ఆర్‌ఎం ఆర్.కవిత ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 3గంటల నుంచి 4వరకు 9959 226148 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు, సలహాలు, సూచనలు తెలియజేయాలని సూచించారు. అదే విధంగా కూకట్‌పల్లి డిపో పరిధిలో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎం.హరి తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 3 నుంచి 4గంటల వరకు 9959226151 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు, సలహాలు, సూచనలు తెలియజేయాలని ఆయన సూచించారు.

నేడు యువ మంతన్ మోడల్ యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్

మాదాపూర్, జూలై 29: యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో యువ మంతన్ మోడల్ యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్‌ను సోమవారం నిర్వహించనున్నది. మంగళవారం యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ ఇనిషియేటివ్ అనే థీమ్‌తో జరగనున్న మోడల్ యునైటెడ్ నేషన్స్ గ్రీన్ హరిజాన్స్ నావిగేటింగ్ ది క్లీన్ ఎనర్జీ ట్రాన్సిషన్ అనే అంశంపై దృష్టి సారిస్తున్నట్లు యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ అసోసియేషన్ ప్రొఫెసర్, డాక్టర్ కృష్ణారెడ్డి తెలిపారు. వికసిత్ భారత్ 2047లో భాగంగా యూనివర్సిటీ గ్రాండ్ కమిషన్‌చే ప్రారంభించబడిందన్నారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ ఇనిషియేటివ్ థీమ్‌తో రాబోయే మోడల్ యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్ గ్రీన్ హరిజాన్స్ నాగేటింగ్ ది క్లీన్ ఎనర్జీ ట్రాన్సిషన్‌పై దృష్టి పెడుతున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, ఆర్థిక చిక్కులు, సాంకేతిక ఆవిష్కరణలు, ఇంధన భద్రత, సామాజిక న్యాయం, అంతర్జాతీయ సహకారం వంటి అంశాలపై పలు దేశాలకు చెందిన విద్యార్థులు దౌత్యపరమైన చర్చలు, సహకార విధాన రూపకల్పనను పెంపొందించడమే ఈ సదస్సు యొక్క లక్ష్యమన్నారు.

రోడ్డును ఆక్రమించిన నిర్మాణంపై చర్యలెప్పుడు?

కాలనీ ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్‌రెడ్డి

దుండిగల్, జూలై 29 : కుత్బుల్లాపూర్ సర్కిల్ సుభాష్‌నగర్ డివిజన్ పరిధిలోని సూరారం కాలనీ సాయిబాబానగర్ మెయిన్ రోడ్డును ఆక్రమించి చేపట్టిన నిర్మాణంపై అధికారులు చర్యలెప్పుడు తీసుకుంటారని కృషి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.విజయభాస్కర్‌రెడ్డి ప్రశ్నించారు. తాము సర్కిల్ అధికారులకు ఫిర్యాదు చేసి రెండు నెలలు గడుస్తున్నా చర్యలు తీసుకోవడంలో ఎందుకు వెనుకంజ వేస్తున్నారన్నారు. నిర్మాణదారుడి నుంచి అధికారులకు ఏమైనా ముడుపులు అందాయా? అనే అనుమానం కలుగుతుందని ఆరోపించారు. సామాన్యులు అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే ఆగమేఘాల మీద కూల్చివేసే అధికారులు ఈ విషయంలో ఎందుకు మీనవేషాలు లెక్కిస్తున్నారని ప్రశ్నించారు. సదరు నిర్మాణం వలన ప్రజలు ఇబ్బందులు పడుతారని తెలిసినప్పటికీ చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యమేమిటన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సదరు నిర్మాణాన్ని తొలగించాలని, లేనిపక్షంలో సర్కిల్ కార్యాలయం ఎదుట కాలనీవాసులమంతా ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

నిజాంపేట్ కార్పొరేషన్‌లో ఇంటి నంబర్ల దందా!

- నకిలీ పత్రాలతో ఇంటి నంబర్లు జారీ చేసిన అధికారులు
- చక్రం తిప్పిన ఓ ప్రజాప్రతినిధి, మున్సిపల్ బిల్‌కలెక్టర్..
- భారీగా చేతులు మారిన ముడుపులు..?
- పరిశీలించి చర్యలు తీసుకుంటామన్న కమిషనర్

ప్రగతినగర్‌లోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

దుండిగల్, జూలై 29 : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇంటి నంబర్ల కేటాయింపు దందా దర్జాగా కొనసాగుతున్నది. అధికారులకు అమ్యామ్యాలు చెల్లిస్తే చాలు ఇట్టే పనైపోతుందని తెలుస్తుంది. ఈ దందాలో ఓ ప్రజాప్రతినిధి (కార్పొరేటర్) పావులు కదుపగా బిల్ కలెక్టర్ కీలకంగా వ్యవహరించి, యజమానుల నుంచి భారీగా దండుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మూడు, నాలుగు నెలలుగా ఈ దందా కొనసాగుతుంటుండగా ఉన్నతాధికారులు ఏం చేస్తున్నారనే బలమైన ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వివరాలలోకి వెలితే.. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, బాచుపల్లిలోని రాజీవ్‌గాంధీనగర్ ఈ దందాకు కేంద్ర బిందుగా మారినట్లు తెలుస్తున్నది. గతంలో ఎప్పుడో 20 ఏండ్ల కిందట అప్పటి ప్రభుత్వం పేదలకు కొన్ని ఇండ్ల స్థలాలను కేటాయించి, పట్టాలు కూడా పంపిణీ చేసింది. సదరు పట్టాలను అడ్డుపెట్టుకుని అప్పుడే వేల సంఖ్యలో డూప్లికేట్ పట్టాలు రూపొందించి, వాటిని అమాయకులకు విక్రయించి సొమ్ము చేసుకున్న నేతలు ఉన్నారు. అయితే తాజాగా రాజీవ్‌గాంధీనగర్ పరిధిలోని 15, 16వ డివిజన్‌లల్లో ఇంటి నంబర్ల కేటాయింపు దందా మూడు పువ్వులు.. ఆరు కాయలుగా కొనసాగుతుందని గుసగుసలు వినిపిస్తున్నాయి. అప్పుడెప్పుడో రెండు దశాబ్దాల కిందట ఇచ్చిన పట్టా సర్టిఫికెట్ల మాటున నకిలీ పట్టాలు సృష్టించి మున్సిపల్ కార్పొరేషన్ నుంచి ఇంటి నంబర్లు పొందుతున్నట్లు తెలుస్తుంది. ఇందుకోసం ఒక్కొక్క ఇంటి నంబర్ కేటాయింపునకు రూ.2లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఇలా ఇప్పటి వరకు 50-100 ఇంటి నంబర్లను కేటాయించారని పలువురు స్థానికులు పేర్కొంటున్నారు. ఇందులో ఓ కార్పొరేటర్ చక్రం తిప్పగా వారి వెనకాల కార్పొరేషన్ పరిధిలోని ఓ కీలక నేత ఉన్నట్లు తెలుస్తుంది. వీరికి కార్పొరేషన్‌లో పనిచేసే ఓ బిల్‌కలెక్టర్, ఆయన పైఅధికారి ఒకరు సహకరిస్తూ డబ్బులు భారీగా దండుకున్నట్లు సర్వత్రా ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి ఇంటి నంబర్‌ను కేటాయించాలంటే అందుకు ఇంటి స్థలం పట్టా సర్టిఫికెట్ గాని, స్థల రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ గాని ఉండాలి. అవేమి లేకుండా పాతపట్టాలను అడ్డుపెట్టుకుని అందిన కాడికి దండుకున్న వారిపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం

ఇదే విషయమై నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌ను వివరణ కోరగా.. రాజీవ్‌గాంధీనగర్‌కు సంబంధించిన ఇంటి పట్టాల వివరాలు తెలుపాలని బాచుపల్లి మండలం తహసీల్దార్‌కు మూడు నెలల కిందటే లెటర్ రాశాము. వారు ఇంతవరకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదు. అయితే ఇంటి నంబర్ల కేటాయింపు ఆరోపణల నేపథ్యంలో విచారణ జరుపుతాం. ఒకవేళ అది నిజమని తేలితే జిల్లా కలెక్టర్‌కు సమాచారం అందజేసి, వారి సూచనల మేరకు చర్యలు తీసుకుంటాం. అయితే గడిచిన మూడునాలుగు నెలల కాలంలో రాజీవ్ గాంధీనగర్‌కు సంబంధించిన ఇంటి నంబర్లు 30-35 వరకు కేటాయించినట్లు తెలుస్తుంది. వీటిపైనా విచారణ జరుపుతాం.

– రామకృష్ణారావు, కమిషనర్, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్

నిరుపేదలకు వరం సీఎంఆర్ఎఫ్



భోగారం గ్రామానికి చెందిన కల్యాణికి సీఎంఆర్ఎఫ్ చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

కీసర, జూలై 29: నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో దోహదం చేస్తుందని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. మండల పరిధి భోగారం గ్రామానికి చెందిన గడ్డం కల్యాణికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన చెక్కును సోమవారం ఎమ్మెల్యే వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తు చేసుకొన్నవారందరికి ప్రభుత్వం నుంచి సీఎం రిలీఫ్ ఫండ్ కింద చెక్కులు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్రాంరెడ్డి, భూపాల్, కృష్ణ, రఘుఉన్నారు.

ప్రణాళికాబద్ధంగా డివిజన్ అభివృద్ధి

సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బన్నాల

ఉప్పల్, జూలై 29: ప్రణాళికాబద్ధంగా డివిజన్ సమగ్రాభివృద్ధికి కృషిచేస్తున్నామని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్ ముదిరాజ్ అన్నారు. చిలుకానగర్ డివిజన్‌లోని నార్త్ కల్యాణపురికాలనీలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను సోమవారం బీఆర్ఎస్ నాయకులు పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమానికి నిరంతరం శ్రమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి కొకొండ జగన్, బింగి శ్రీనివాస్, శ్రీనివాస్, బాలు గౌడ్, బంటి గౌడ్, మార్క శ్రీను, గణేష్, కాలనీ అధ్యక్షుడు శివారెడ్డి, నర్సింహులు, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వ్యర్థాల తొలగింపు

ఆల్విన్‌కాలనీ డివిజన్ శాతవాహన కాలనీ రాంకీ ప్రధాన ద్వారం వద్ద పేరుకుపోయిన చెత్త ఇతర వ్యర్థాలను పారిశుద్ధ్య కార్మికులతో కలిసి కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ ఆదివారం తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, మురుగు, వ్యర్థాలు పేరుకుపోకుండా చూసుకోవాలన్నారు. రహదారి పక్కన పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించాలని కార్మికులకు కార్పొరేటర్ సూచించారు. ఈ కార్యక్రమంలో శివరాజ్, బాలస్వామి నాయక్ పాల్గొన్నారు.

– మియాపూర్, జూలై 29

కార్మికులకు అన్యాయం జరిగితే ఊరుకోం

కార్మికులకు నష్ట పరిహారం అందజేస్తున్న కార్మికనేత రవిసింగ్

బాలానగర్, జూలై 29: వివిధ కంపెనీల్లో పని చేస్తున్న కార్మికులకు అన్యాయం జరిగితే ఊరుకునే ప్రసక్తే లేదని, ఉపాధి కోల్పోయిన కార్మికులకు కంపెనీ యాజమాన్యం నుంచి రావాల్సిన పరిహారం ఇప్పించినట్లు బీఆర్‌టీయూ కార్మిక నాయకుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్ పేర్కొన్నారు. సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని దుండిగల్ మున్సిపల్ ఇండస్ట్రీ ఏరియా మాస్క్ ఎంటర్‌ప్రైజెస్ కంపెనీలో నవీన్‌కుమార్‌రెడ్డి, రవి అనే కార్మికులు గత కొన్నేండ్లుగా పని చేస్తున్నారు. అయితే కంపెనీ యాజమాన్యం ఇటీవల కార్మికులకు ఎలాంటి సమాచారం లేకుండా విధుల నుంచి తొలగించింది. వారికి ఇవ్వాల్సిన జీతం ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్‌టీయూ కార్మిక నేత రవిసింగ్‌ను కలిసి సమస్యను వివరించారు. దీంతో స్పందించిన ఆ కంపెనీ యాజమాన్యంతో చర్చించి నవీన్‌కుమార్‌రెడ్డికి రూ.లక్షా 14వేలు, రవికి రూ.48 వేలు ఇప్పించారు. ఈ సందర్భంగా రవిసింగ్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

దివ్యాంగులకు వీల్‌చైర్లు అందజేత



దివ్యాంగులకు వీల్‌చైర్లను పంపిణీ చేస్తున్న లయన్ వెంకట్‌రావు

అల్లాపూర్, జూలై29: బంజారహిల్స్ లయన్ 320ఏ అధ్యక్షుడు కెల్లా వెంకట్‌రావు ఆధ్వర్యంలో ఆయన తల్లిదండ్రులు కెల్లా సన్యాసిరావు, నారాయణమ్మ దంపతుల చేతులమీదుగా అర్హులైన దివ్యాంగులకు వీల్‌చైర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకట్‌రావు మాట్లాడుతూ.. దివ్యాంగులు ఎవరిమీద ఆధారపడకుండా తమ పని తాము చేసుకుని ఆత్మగౌవరం తో బతకాలనే సదుద్దేశంతో మూడు చక్రాల సైకిళ్లను పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలోమంగి వెంకటరమణ, బొడ్డు బుచ్చయ్య, ఉచ్చల వెంకటేశ్వర్లు, జనసేన ఇన్‌చార్జి చినిమిల్లి చంద్రశేఖర్, చిరంజీవి రాజు, కెల్లా వెంకటరమణ, గోర్ల సత్యనారాయణ, వెంకటేశ్, మురళీ, శ్రీను, రాంబాబు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రచారంలో దూసుకుపోతున్న మస్తాన్‌రెడ్డి

మద్దతుదారులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మస్తాన్‌రెడ్డి

అల్లాపూర్, జూలై 29 : ఈ ఆదివారం జరగనున్న వివేకానందనగర్ సంక్షేమ సంఘం ఎన్నికల ప్రచారంలో దేవరింటి మస్తాన్‌రెడ్డి దూసుకుపోతున్నాడు. ఇంటికో ఓటు చొప్పున 1095 ఓట్లతో అతిపెద్ద కాలనీగా పేరుగాంచిన వివేకానందనగర్ సంక్షేమ సంఘానికి ఆరేండ్ల తరువాత ఎన్నికలు జరుగుతుండడటంతో అభ్యర్థుల మధ్య ఎన్నికల ప్రచారం హోరాహోరీగా సాగుతున్నది. మస్తాన్‌రెడ్డి ప్రతి ఇంటికి వెళ్లి మ్యానిఫెస్టో అందజేసి, తనను గెలిస్తే కాలనీవాసులకు అందుబాటులో ఉంటూ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని చెబుతూ.. ఓటర్లను ఓటు అభ్యర్థిస్తున్నాడు.

నిరుపేదలకు వరం సీఎం సహాయనిధి

నిరుపేదలకు సీఎం సహాయనిధి పథకం వరంగా ఉందని కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేశ్ అన్నారు. సోమవారం కూకట్‌పల్లి డివిజన్‌కు చెందిన కొత్తగొల్ల రమేశ్, విష్ణుసోహన్‌లకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను కాంగ్రెస్ నేత గొట్టిముక్కల వెంకటేశ్వర్‌రావుతో కలిసి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా ఎంతో మంది నిరుపేదలు మెరుగైన వైద్యం పొందుతున్నారని సంతోషం వ్యక్తం చేశారు. కొత్తగొల్ల రమేశ్‌కు రూ.30వేలు, సోహన్‌దాస్‌కు రూ.12వేల చొప్పున చెక్కులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కేపీహెచ్‌బీ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రవీణ్, కూకట్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు మేకల రమేశ్, ఫణికుమార్, వాసు తదితరులు పాల్గొన్నారు.

– బాలానగర్, జూలై 29

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయండి

ఆల్విన్‌కాలనీ డివిజన్ ఉషాముళ్లపూడి దారిలో భవ్యాస్ తులసీవనం వద్ద కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీసులు ఆదివారం పర్యటించారు. జగద్గిరిగుట్ట గాజులరామారం ఎల్లమ్మ బండ సహా జాతీయ రహదారి మీదుగా నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నందువల్ల ప్రమాదాలకు ఆస్కారం లేకుండా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని తులసీవనం వాసులు పోలీసులను కోరారు. కీలకమైన ఉషాముళ్లపూడి దారిలో డివైడర్ల నిర్మాణం ద్వారా ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాదాలకు ఆస్కారం ఉండదన్నారు. పాదచారులు, వాహనదారులు కాలనీవాసుల భద్రత దృష్ట్యా వాటిని ఏర్పాటు చేయాలని కోరారు. వీలైనంత త్వరగా నివారణ చర్యలు చేపడుతామని పోలీసులు పేర్కొన్నట్లు కాంగ్రెస్ మహిళా నేత సత్తూర్ శిరీష పేర్కొన్నారు. ఈ పర్యటనలో ట్రాఫిక్ ఏసీపీ వెంకటయ్య, ఇతర అధికారులు సిబ్బంది, తులసీవనం వాసులున్నారు.

– మియాపూర్, జూలై 29

పేదలకు భరోసా సీఎం సహాయనిధి : ఎమ్మెల్యే గాంధీ



మియాపూర్, జూలై 29: సీఎం సహాయ నిధి పేదలకు భరోసానిస్తుందని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఈ పథకం సాయంతో నిరుపేదలు అత్యుత్తమ వైద్య సేవలతో తమ అనారోగ్యాలను దూరం చేసుకుంటున్నారన్నారు. మియాపూర్ డివిజన్‌కి చెందిన గాలయ్య గౌడ్‌కు అత్యవసర వైద్య సేవల నిమిత్తం సీఎం సహాయనిధి పథకం కింద మంజూరైన రూ. 60వేల చెక్కును కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఎమ్మెల్యే గాంధీ ఆదివారం తన నివాసంలో అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనారోగ్యంతో పాటు పేదరికంతో ఏ ఒక్కరూ వైద్యానికి దూరంగా ఉండొద్దన్నదే ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకోసం సీఎం సహాయనిధి పథకం తోడ్పాటునందిస్తున్నదన్నారు. కార్యక్రమంలో నరేశ్ పాల్గొన్నారు.

ఘనంగా ఫలహారం బండి ఊరేగింపు



రాయదుర్గంలో ఫలహారం బండి ఊరేగింపులో ముఖ్యఅతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ, గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా

శేరిలింగంపల్లి/బాలానగర్, జూలై 29: బోనాల ఉత్సవాల్లో భాగంగా ఫలహారం బండి ఊరేగింపు రాయదుర్గంలో సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. యువకుల నృత్యాలు, డప్పుల దరువుల మధ్య కళాకారుల ఆటపాటలతో అంగరంగ వైభవంగా ఊరేగింపు కొనసాగించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొని సందడి చేశారు.

– బాలానగర్ : బోనాలను పురస్కరించుకొని అమ్మవారికి ఫలహారం బండి ఊరేగింపులు నిర్వహించడం శుభ సూచకమని ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్ అన్నారు. సోమవారం ఫతేనగర్‌లో కె.క్రాంతి ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమానికి ఆయన హాజరై పూజలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో సూరజ్‌కుమార్ తివారీ, కె.రాము ముదిరాజ్, బానేశ్‌ముదిరాజ్, బద్రి శంకర్ ముదిరాజ్, బ్రహ్మం, భరత్‌కుమార్ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఫలహారం బండి ఊరేగింపులో పాల్గొన్న కార్పొరేటర్ సతీశ్‌గౌడ్

– హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని హఫీజ్‌పేట్‌లో సోమవారం ఏర్పాటు చేసిన బోనాల ఉత్సవాల్లో స్థానిక డివిజన్ నాయకులు బాలింగ్ గౌతమ్‌గౌడ్‌తోపాటు పార్టీ కార్యకర్తలతో కలిసి అమ్మవారికి పూజలు చేసిన ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ – మాదాపూర్, జూలై 29

క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న దీపక్‌జాన్

దుండిగల్, జూలై 29 : రాష్ట్రంలో క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర క్రిస్టియన్ కమ్యూనిటీ వెల్ఫేర్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్‌జాన్ అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నిజాంపేట్ రాక్‌చర్చీలో సోమవారం జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని క్రైస్తవులతో పాటు పాస్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలను స్థానిక నేతలు ఆయన దృష్టికి తీసుకెళ్లగా, సానూకులంగా స్పందించిన దీపక్‌జాన్ క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. క్రైస్తవ సోదరులు తమ హక్కులను వినియోగించుకోవాలని సూచించారు. క్రైస్తవుల శ్మశానవాటిక, కమ్యూనిటీహాల్ నిర్మాణానికి సహకరిస్తానన్నారు. ఈ సమావేశంలో కుత్బుల్లాపూర్ క్రైస్తవ కమ్యూనిటీ అసోసియేషన్ చైర్మన్ పాస్టర్ శౌరి, ప్రధాన కార్యదర్శి పాస్టర్ అబ్రహం, క్రిస్టియన్ కమ్యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పాస్టర్ పి.జాషువ, జనరల్ సెక్రటరీ ఈఎం.చారి, కోశాధికారి జేమ్స్, జగదేకకుమార్, యహోషువా, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.